01ATP06_01ATP06.qxd 08-04-2023 PM 10:54 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 09 ఏప్రిల్ 2023 పేజీలు : 04


# లోకేష్ పర్యటనలో మార్పులు

**- 13, 14 తేదీల్లో కర్నూలు జిల్లాలోకి అడుగులు**



**అనంతపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త బ్యూరో**

టీడీపీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 13, 14 తేదీల్లో నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించనుంది. ముందుగా అనుకున్నట్లు తాడిపత్రి నుంచి బుగ్గమీదుగా, కోవెలకుంట్ల, బనగానపల్లె వైపు లోకేష్ పర్యటన ఉంటుందని టీడీపీ నేతలు ప్రకటించారు. ఆ మేరకు ఏర్పాట్లుకూడా చేసుకున్నారు. తాజాగా లోకేష్ పర్యటన మార్పులు చేశారు. కారణాలు తెలియాల్సి ఉంది. యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రారంభమైంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, రామగిరి, ధర్మవరం, అనంతపురం అర్బన్, ఉరవకొండ నియోజకవర్గాల మీదుగా పాదయాత్ర కొనసాగి, శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలంలో పాదయాత్ర కొనసాగుతోంది. 9వ తేదిన శింగనమల నియోజకవర్గం శింగనమల మండలం నాగలగుడ్డం, వెస్ట్ నర్సాపురం, చిన్న జలాలపురం, గోవిందరాయుని పేట మీదుగా 10వ తేదిన మట్లగొంది, సలకం చెరువు, కొరివిపల్లి, ఉల్లికంటి పల్లి వరకు నారా లోకేష్ పాదయాత్ర కొనసాగుతుంది. 11వ తేదిన తాడిపత్రి నియోజకవర్గం పెద్దపప్పూరు మండలంలో సింగనగుట్టపల్లి మీదుగా ఛాగల్లు, పెద్దపప్పూరు, చిన్నపప్పూరు, అశ్వర్థం, గార్లదిన్నె మీదుగా యాడికి మండలంలోకి ప్రవేశిస్తుంది. 12వ తేదిన కమ్మవారిపల్లి, నగరూరు, చుట్టాలపల్లె, రామరాజుపల్లి, మీదుగా రాయలచెరువుకు చేరుకుని అదే రోజు సాయంత్రం రాయలచెరువులో ఏర్పాటు చేసే బహిరంగ సభలో నారా లోకేష్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారుతారు. ఈ నెల 13వ తేదిన యాడికి మండలం నుంచి చందనదయాలమడుగు మీదుగా నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోకి నారా లోకేష్ పాదయాత్ర ప్రవేశిస్తుంది. నల్లమాకులపల్లి, హుస్సేనాపురం, పిఆర్‌పల్లి మీదుగా డోన్‌వైపు పాదయాత్ర కొనసాగుతుంది. ఇందులోభాగంగా శుక్రవారం డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ సుబ్బారెడ్డి తదితర నేతలు నారా లోకేష్ పాదయాత్రలో గార్లదిన్నె మండలంలో పాల్గొని పార్టీ నేతలతో సమాలోచనలు కూడా చేసినట్లు తెలుస్తోంది. డోన్ నియోజకవర్గంలో ముఖ్యంగా కర్నూలు జిల్లాలో పాదయాత్రను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న వషయంలో కోట్ల సుజాతమ్మ, టీడీపీ ముఖ్యులతో చర్చలు జరిపినట్లు తెలియవచ్చింది. ఇదిలా ఉండగా లోకేష్ పాదయాత్ర శింగనమల నియోజకవర్గం పూర్తి అయిన తర్వాత పెద్దపప్పూరు మండలంలో ప్రవేశించి జేసి సోదరులు స్వగ్రామమైన జూటూరులో బస ఉండే విధంగా ముందుగా ఏర్పాటు చేశారు. జూటూరు నుంచి తాడిపత్రి పట్టణంలో పాదయాత్ర నిర్వహించి ఆ తర్వాత పాదయాత్ర రూరల్ మండలం వెంకటరెడ్డిపల్లి బుగ్గ మీదుగా నంద్యాల జిల్లా బనగానపల్లి నియోజకవర్గంలోకి లోకేష్ పర్యటన ఉంటుందని టీడీపీ ముఖ్యులు చెప్పారు. తాడిపత్రి మీదుగా లోకేష్ పర్యటన కొనసాగుతుందని, తాడిపత్రి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జెసి అస్మిత్‌రెడ్డి కూడా ప్రకటించినట్లు పత్రికల్లో వార్తలు ప్రచురితం అయ్యాయి. అయితే కారణాలు తెలియదు కానీ లోకేష్‌పర్యటనలో మార్పు జరిగింది. తాడిపత్రి వైపు రాకుండానే పెద్దపప్పూరు మండలం నుంచి యాడికి మండలంలో పర్యటించి రాయలచెరువు మీదుగా నంద్యాల జిల్లా డోన్‌వైపు పాదయాత్ర కొనసాగే విధంగా టూర్‌కరారు చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా యువగళం పాదయాత్ర పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు సంబంధించి ఒక రోజు ముందుగానే మాత్రమే రూట్ మ్యాప్‌ను పత్రికలకు విడుదల చేస్తున్నారు. జిల్లా మొత్తం కానీ, నియజకవర్గం మొత్తం కానీ రూట్‌మ్యాప్ ఇలా ఉంటుందని టీడీపీ అధికారికంగా చె ప్పడం లేదు. పాదయాత్ర ఒకవైపు కొనసాగిస్తూ ఒక రోజున ముందుగా మాత్రమే అధికారికంగా రూట్‌మ్యాప్‌ను ప్రకటించి ఏ సమయానికి నారా లోకేష్ ఎక్కడ బస చేస్తారు, ఏ సమయానికి విశ్రాంతి తీసుకుంటారు, ఏ సమయానికి రైతులు ఇతర సామాజిక వర్గాల వారితో మాట్లాడుతారన్నది రూట్‌మ్యాప్‌లో నిర్వహకులు ప్రకటిస్తున్నారు. ఏది ఏమైనా రూట్ మ్యాప్‌లో మార్పులు జరగడం చర్చనీయాంశంగా మారింది.

# పోలవరం పూర్తి చేసి

# రిబ్బన్ కటింగ్ చేసేది టిడిపి ప్రభుత్వమే..




రైతుల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న నారా లోకేష్, హాజరైన రైతు ప్రతినిధులు, హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

**అనంతపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త బ్యూరో**

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసినరిబ్బన్ కటింగ్ చేసేది రాబోయే టిడిపి ప్రభుత్వమే. పోలవరం పూర్తి చేసే విషయంలో మూడు సార్లు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీలు ఇచ్చి చేతులు ఎత్తేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక పోలవరం పూర్తి చేసి అటు విశాఖకు, ఇటు రాయలసీమకు సాగునీరు, తాగునీరు ఇస్తామని గోదావరి జలాలను రాయలసీమకు తీసుకొస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ వెల్లడించారు. అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం జమ్ములదిన్నెలో శనివారం సాయంత్రం జరిగిన రైతు ప్రతినిధులతో ఇష్టాఘోష్టి కార్యక్రమంలో నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయానికి సంబంధించి విశ్రాంత ప్రొఫెసర్ రమేష్, ఇతర రైతు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంట నష్టపోయిన ప్రతి రైతుకు ఇన్‌పుట్ సబ్సిడి అందే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. రైతులు పండించిన పంటకు గిట్టు బాటు ధర వచ్చే విధంగా ప్రాసెసింగ్ సెంటర్లతోపాటు మార్కెట్ లింకేజీ చేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, నారా లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లాలో అరటి రైతులు 45వేల టన్నులను ప్రతియేటా ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఎగుమతి చేసి రికార్డు సృష్టిస్తున్నారు. దీనికి కారణం టీడీపీ ప్రభుత్వ హయాంలో అరిటి రైతుల కోసం అప్పుడు సీఎం చంద్రబాబునాయుడు తీసుకున్నచర్యలే కారణం అన్నారు. అరటి రైతులను ప్రోత్సహించినట్లే చీనీ, పట్టు రైతులు ఇతర రైతులు పండించిన పంటలకు, పండ్లకు మంచి గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. వ్యవసాయానికి టెక్నాలజీని అనుసంధానం చేసే విషయంలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. నేటి యువత బెంగుళూరు, హైదరాబాద్, ఇతర నగరాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపు మొగ్గు చూపుతోంది. ఆ యువత కూడా వ్యవసాయం వైపు మొగ్గు చూపే విధంగా వ్యవసాయ రంగాన్ని ప్రక్షాళన చేసి అన్ని విధాలా రైతులకు మేలు కల్పించేందుకే చర్యలు తీసుకుంటాం. డీజిల్, పెట్రోల్ రేట్లు విపరీతంగా పెరిగాయి. వాటివల్లే ఎరువులు, క్రిమి సంహారక మందులు, ఇతర యంత్రాల ధరలు పెరిగాయని లోకేష్ అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకుని, ఎరువులు, క్రిమి సంహారక మందులు ఇతర వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు తగ్గే విధంగా చర్యలు తీసుకుంటాం. ఇప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే సబ్సిడి ధరలతో డ్రిప్, ఇతర పరికరాలు అందించాం. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ సబ్సిడిలన్నీ కోత కోశారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 90 శాతం సబ్సిడితో డ్రిప్‌ను అందజేశాం. బటన్ నొక్కితేనే సబ్సిడి ధరలతో ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు సబ్సిడి ధరలతో అందే విధంగా టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇన్‌పుట్ సబ్సిడి, ఇన్సురెన్స్ వచ్చేవి. ప్రస్తుతం వైసీపీ పాలనలో ఇటీవల ప్రకృతి వైపరీత్యాలు జరిగి వడగండ్ల వాన వల్ల.. ఉదాహరణకు అనంతపురం జిల్లాలోనే భారీ నష్టం వాటిల్లింది. దానిపైన మేము నష్ట పరిహారం ఇస్తాం.. లేకుంటే ఏదో విధంగా సహాయం చేస్తామన్న ప్రకటన కూడా ప్రభుత్వం నుంచి రాలేదని, ఆయన ఎద్దేవా చేశారు. రైతులకు పంటనష్టం జరిగితే ఆదుకునే విధంగా ఇన్సురెన్స్ ప్రీమియర్‌లు మేమే కడతామని ప్రభుత్వం చెప్పింది కానీ ఆచరణలో చేతులెత్తేసిందన్నారు. పంట నష్టంకూడా రాజకీయ కోణంలో వైసీపీ ప్రభుత్వం చూస్తూ వైసీపీ రైతులకే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటోందని ఆయన ఆరోపించారు. చీనీ రైతులకు సంబంధించి ఇప్పటికీ మార్కెట్లలో మధ్య దళారి వ్యవస్థ ఉందని, టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పూర్తిగా నిర్మూలిస్తామన్నారు.

**తలపాగ చుట్టి.. పంచె కడతా..:**

యువగళం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తూ.. పాదయాత్రను పూర్తి చేసి రైతుల మనస్సును గెలిచిన తర్వాత టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. తాత ఎన్టీరామారావు తరహాలో తలపాగా చుట్టి పంచ కడతానని యువనేత నారా లోకేష్ వెల్లడించారు. విశ్రాంత ప్రొఫెసర్ రమేష్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా లోకేష్ మాట్లాడుతూ.. ఏదో ఫోజులు ఇవ్వాలని ఇప్పుడు తలపాగా చుట్టి, పంచెలు కట్టడం సరికాదని, రైతుల మనస్సు గెలిచిన తర్వాతనే తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల బాగుకోసం ప్రయత్నిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈ ప్రభుత్వంపైన పోరాడుతున్నాని, ప్రజలు కూడా తగిన రీతిలో స్పందించి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా స్పందించాలన్నారు. పిల్లల ఆలోచనలను బట్టి వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఏతల్లిదండ్రులకైనా ఉందని, తన కుమారుడు దేవాన్ష్ వ్యవసాయంపై మొగ్గు చూపితే తప్పక ప్రోత్సహిస్తానని లోకేష్ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, అమర్‌నాథ్‌రెడ్డి,సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షులు బికె.పార్థసారధి, మాజీ ఎమ్మెల్యేలు హనుమంతరాయ చౌదరి, జితే ంద్రగౌడు,ప్రభాకర్‌చౌదరి,మాజీ ఎంఎల్‌సీ గుండుమల తిప్పేస్వామి, ఎంఎల్‌సి దీపక్‌రెడ్డి శింగనమల నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసనాయుడు, ఇతర టిడిపి నాయకులు ఎల్.నారాయణ చౌదరి,రామ్మోహన్‌చౌదరి, మాజీ జెడ్పీ ఛైర్మన్ పూలనాగరాజు, కళ్యాణదుర్గం టిడిపి ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర్‌నాయుడు, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతు ప్రతినిధులు ఈ కార్యక్రమానికి వచ్చారు.

# మేడాపురం సూరి ఎవరు..? కేతిరెడ్డి నీ ఆత్మకాదా

**- ఎమ్మెల్యే కేతిరెడ్డి వ్యాఖ్యలకు ఘాటు సమాధానం ఇచ్చిన పరిటాల శ్రీరామ్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

**అనంతపురం ఏప్రిల్ 8 ప్రభాతవార్త ప్రతినిధి**

ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నారా లోకేష్‌తో పాటు తనపై చేసిన వ్యాఖ్యల మీద ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. అనంతపురంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూగుల్ మ్యాప్ తీసుకొని వచ్చి తానేదో నిజాయితీ పరుడు అన్నట్టుగా కేతిరెడ్డి మాట్లాడుతున్నారని ఎగ్రుట్టలో నీఫామ్ హౌస్ చుట్టూ ఉన్న స్థలం ఎవరిది అని ప్రశ్నించారు. ఆస్థలం జి.సూర్యనారాయణ అలియాస్ మేడాపురం సూరిది అని నువ్వే స్పష్టంగా చెబుతున్నావని శ్రీరామ్ అన్నారు. మేడాపురం సూరి అంటే కేతిరెడ్డి ఆత్మ అని ధర్మవరంలో ఎవరిని అడిగినా చెప్తారన్నారు. ఇలాంటి పేర్లన్నీ నువ్వే బయటకు తీసి నీ అక్రమాలను నువ్వే బయట పెట్టుకుంటున్నావన్నారు. నాపేరు చెప్పి భూ ఆక్రమణలు చేస్తే చెప్పుతో కొట్టండి అంటూ వ్యాఖ్యలు చేసిన కేతిరెడ్డి ముందు ఆక్రమణలకు పాల్పడిన అనుచరులను నువ్వే కొట్టాలని సూచి ంచారు. ఆతర్వాత ప్రజలు వారిని ఎలా కొట్టాలో నిర్ణయిస్తారన్నారు. రాయలసీమ ప్రాంతంలో రైతుల సమస్యల గురించి నారా లోకేష్ నేరుగా తెలుసుకుంటున్నారని వారితో చాలా సమావేశాలు ఇప్పటికే నిర్వహించారని శ్రీరామ్ అన్నారు. ఇవన్నీ కేతిరెడ్డికి కనిపించడంలేదా అని ప్రశ్నించారు. పాదయాత్ర అంటే సిఎం జగన్‌లా ముద్దులు పెట్టడం బుగ్గలు నిమరడం వంటివి లోకేష్ చేయరన్నారు. ఎన్‌టీఆర్ పేరు తెలుగు ప్రజలు ప్రతి ఒక్కరూ వాడుకుంటారని అలాంటిది నారా లోకేష్ ఆయన తన తాత అని చెప్పడంలో తప్పేముందని ప్రశ్నించారు. దీనిని కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారంటే కేతిరెడ్డి స్థాయి ఏంటో అర్థమవుతోందని శ్రీరామ్ వ్యాఖ్యానించారు. పరిటాల రవి ఆశ్రమం ద్వారా వందలాది మందికి ఉచిత వివాహాలు చేశారని ఉచితంగా వందలాది వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారని ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. పరిటాల రవి పేరు పదేపదే కేతిరెడ్డి తలుచుకుంటున్నారని ఆయన గురించి మంచిగా తలుచుకుంటే ఆశీర్వాగం ఉంటుందని లేదా చెడుగా తలుచుకుంటే ఎక్కడికి పోతావో ఒకసారి ఆలోచించుకో అంటూ హితవు పలికారు. ఇప్పటికైనా మాటలు అదుపులో పెట్టుకొని చీఫ్‌పాలిటిక్స్ మానుకొవాలని కేతిరెడ్డికి శ్రీరామ్ సూచించారు.

# కుక్కకాటుతో చిన్నారి జాహ్నవి మృతి

**బ్రహ్మసముద్రం ఏప్రిల్ 08 ప్రభాతవార్త,**



జాహ్నవి ( ఫైల్ ఫోటో)

మండలంలోని ముప్పలకుంట గ్రామానికి చెందిన పూజారి గోపాల్ ప్రమీళ దంపతుల కూతురు జాహ్నవి (2) సంవత్సరాల చిన్నారిని మూడునెలల క్రితం కుక్కకాటు వేసింది కుక్కకాటు వేసిన సంగతి తెలియక చిన్నగాయమేకదాఅని తల్లితండ్రులు కట్టుకట్టారు దాదాపు మూడునెలల తరువాత తీవ్ర జ్వరం రావడంతో అనంతపురం,కర్నూలులో చికిత్స చేయించినా ప్రయోజనం లేకపోవడంతో బెంగళూరుకు వెళ్ళి చికిత్స చేయించిన జాహ్నవి మృతి చెందింది డాక్టర్‌లు కుక్కకాటువేయడంతో చిన్నారి మృతి చెందిందని నిర్ధారించారు.

# అభివృద్ధి గూర్చి మాట్లాడే అర్హత టీడీపీకు లేదు..!

**- ఎవరేం చేశారో చర్చకు ఎప్పుడు, ఎక్కడైనా రెడీ - విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి - టీడీపీ కాలం చెల్లిన పార్టీ అని దాన్ని ఎవరూ నమ్మరని వ్యాఖ్య - నాలుగు సార్లు గెలిచిన పయ్యావుల కేశవ్‌వద్ద ఒరిగిందేమీ లేదని విమర్శ**

**ఉరవకొండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు తెలుగుదేశం పార్టీకు లేదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి విమర్శించారు. శనివారం ఆయన వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని తన స్వగృహంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీకు ప్రాతినిధ్యం వహించి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన పయ్యావుల కేశవ్ వల్ల నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఉరవకొండ నియోజకవర్గంలో పర్యటించినపుడు ఆయన చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ తీవ్రంగా తప్పు పట్టారు. అవగాహనలేని నారా లోకేష్ ద్వారా పయ్యావుల కేశవ్ అబద్దాలను అందంగా చెప్పించారని ఉరవకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి తామే తమ ప్రభుత్వ హయాంలో చేశామంటూ చెప్పుకు రావడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. హంద్రీనీవా ద్వారా ఈ ప్రాంతానికి నీళ్లు తీసుకురావడానికి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి కారణమని రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందించడానికి ఆయన వేల కోట్ల రూపాయలను ఖర్చు చేశారని కొనియాడారు. దాదాపు 86 కోట్ల రూపాయలతో పీఏబీఆర్ నుండి ఉరవకొండ నియోజకవర్గానికి తాగునీటి పథకాన్ని తాను మంజూరు చేయించానని, ఉరవకొండ నిర్మించిన ప్రభుత్వాసుపత్రి 2012లో తాను ప్రతిపాదనలు పంపగా మంజూరు అయిందేనన్నారు. సమైఖ్యాంధ్ర ఉద్యమం తర్వాత నిర్మాణ పనులు చేపట్టారని దాన్ని తానే మంజూరు చేయించానని పయ్యావుల కేశవ్ చెప్పడం తప్పని ఆ విషయం స్వయంగా తానే కేశవ్‌కు చెప్పానని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో కార్యాలయాలు, గురుకుల పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల, పాఠశాలలకు సొంత భవనాలు, అదనపు తరగతి గదులు, ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలను తాను స్వయంగా ప్రతిపాదనలు సిద్ధంచేసి మంజూరు చేయించినవని ఈ విషయంలో ఎక్కడైనా బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. ప్రస్తుతం కూడా దాదాపు 69 కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నివారించడానికి నిధులు మంజూరు చేయించామని, నియోకవర్గంలోని దాదాపు 62 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోతే అందులో 44 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు మంజూరు చేయించానని వివరించారు. నారా లోకేష్, పయ్యావుల కేశవ్ ఇరువురు కలిసి గ్రామ స్వారాజ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి మానస పుత్రికలైన గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్‌లవద్ద, నాడు-నేడు ద్వారా నియోజకవర్గంలో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు రూపు రేఖలు ఎలా మారాయో వాటివద్ద, ఇంటివద్దకే రేషన్ అందిస్తున్న వాహనాల వద్ద నిలబడి సెల్ఫీలు దిగి వాటిని తమ పచ్చ మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచురించే దమ్ముందా అని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. రైతులకు రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, జలకళ, విత్తనాల పంపిణీ, ఆసరా, అమ్మఒడి, విద్యాదీవెన, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, చేయూత, వాహనమిత్ర, వేలాది సంఖ్యలో కడుతున్న జగనన్న ఇళ్లు, ఇవన్నీ పచ్చ పార్టీ కళ్ళకు కనబడటంలేదా అని ప్రశ్నించారు. ప్రతి పేదవాడికి పారదర్శకంగా అందుతున్న సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక ఇలా అసత్య ప్రచారాలకు తెరతీస్తున్నారని

మిగతా 3లో...

**నిరాదరణకు గురైన బాలలను ఆదుకునేందుకే**

# “మిషన్ వాత్సల్య పథకం”

**- కలెక్టర్ బసంత్‌కుమార్**

**పుట్టపర్తిరూరల్, ఏప్రిల్ 08, ప్రభాతవార్త**

నిరాదరణకు గురైన బాలబాలికలను ఆదుకునేందుకే కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య పథకంను ప్రారంభించిందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో అనాథలుగా ఉన్న బాలలు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు, లేదా దూరమైన వారు, తల్లిలేక, తండ్రిని కోల్పోయిన వారు, వితంతువు లేదా విడాకులు తీసుకున్న లేదా కుటుంబం వదిలివేసిన తల్లియొక్క పిల్లలు, అనాథ మరియు ఇతర కుటుంబ సభ్యులతో కలసి నివశిస్తున్న బాలలు, ప్రాణాంత వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు, ఆర్థికంగా, శారీరకంగా పిల్లలను పెంచలేని నిస్సాహాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు పై పథకానికి అర్హులన్నారు. అలాంటి ఎవరైనా 0 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు వైద్యం, విద్య, అభివృద్ధి అవసరాలు తీర్చడానికి కొంత సహాయం అందించడానికి కేంద్ర ప్రాయోజిత పథకమైన మిషన్ వాత్సల్య పథకం ద్వారా స్కాలర్‌షిప్‌ను కొన్ని షరతులతో అందించడం జరుగుతుందన్నారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా పిల్లలకు రూ.4000లు ప్రతి నెలా అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం క్రింద స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని, ఒక కుటుంబంలో ఇద్దరు ప్లిలల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత ఉన్న బాలలు ఆయా క్యాటగిరిల ఆధారంగా ఉన్నట్టు గుర్తిస్తే ఆయా ప్రాంతాలకు చెందిన గ్రామ మహిళా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తల స్వచ్ఛంధ సేవా సంస్థల ప్రతినిధులు దరఖాస్తులను పూర్తీ చేసి జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి కార్యాలయమునకు ఈ నెల 15వ తేదిన దరఖాస్తులు సమర్పించుకోవాలన్నారు. ఇందు కోసం బాలుడి లేదా బాలికల జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, తల్లిదండ్రి ఆధార్ కార్డులు, లేదా తల్లిదండ్రి మరణధృవీకరణ పత్రాలు, గార్డియన్ ఆధార్ కార్డు, రేషన్ లేదా రైస్‌కార్డు, కులధృవీకరణ పత్రం, బాలుడి లేదా బాలికల పాస్‌ఫోటో, స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ పత్రం, బాలుడి, లేదా బాలికల బ్యాంకు ఖాతా అకౌంట్, తల్లిదండ్రి సంరక్షులతో కలసిన జాయింట్ అకౌంట్ ఖాతాపుస్తకం ప్రతులను అందించాల్సి ఉంటుందన్నారు.

02ATP27_02ATP27.qxd 08-04-2023 PM 10:48 Page 1



## కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి.. కిరణ్‌కుమార్‌రెడ్డికి లేదు


పిసిసి డెలిగేట్ సభ్యుడు కోరి నాగరాజు (ఫైల్‌ఫోటో)

**బొమ్మనహాళ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దర్గా హొన్నూరు గ్రామంలో తన స్వగృహంలో పిసిసి డెలిగేట్ సభ్యులు కోరి నాగరాజు శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పెట్టిన బిక్షతో ఎమ్మెల్యే స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగి, నేడు మతతత్వం పార్టీ తీర్థం పుచ్చుకుని తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారంటే అది మీ స్థాయి కాదన్నారు. ఒకప్పుడు ఎమ్మెల్యే టికెట్ కోసం కాంగ్రెస్ పార్టీ కాళ్లు పట్టుకుని నేడు గద్దెనెక్కి అదే పార్టీని విమర్శిస్తున్నారంటే కన్న తల్లి వంచనకుడనే. మీ లాంటి వాడికి జీవితంలో పుట్టగతులు ఉండవని గుర్తుంచుకో అన్నారు. మేధావులైనా ఎల్‌కె అధ్వాని, యడ్యూరప్ప లాంటి నాయకులనే హంగ్ తినిపించిన మోడీ వద్ద నీ కుప్పగెంతులు జరగవని వారు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కన్న తల్లి అని మరిచిపోకు.. రాబోవు రోజుల్లో కేంద్రంలో అధికారం సాధించిన నాడు నీవు అధికారం కోసం మళ్లీ కన్నతల్లి వద్దకు చేరుతావని వారు జోష్యం చెప్పారు. నీలాంటి మేధావులు ఎంతో మంది కాంగ్రెస్ పార్టీని వదిలిపోయి నేడు మళ్లీ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, నీలాంటి వారుకాంగ్రెస్ పార్టీ అనేది సముద్రం లాంటిదని నీవు పోయినంత మాత్రాన పార్టీకి ఒరిగేది ఏమీ లేదని గోడ మీద పిల్లిలాంటి మీలాంటి వారు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే దయ్యాలు వేలాదు పలికినట్లు ఉంటుందని ఘాటుగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కురుబ రాజన్న, పాల్తూరు వన్నప్ప, చెట్ల వన్నప్ప, గంగాధర్, రాగేపల్లి వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న నువ్వే మానమ్మకం కార్యక్రమంను ప్రారంభించిన ఎంపిపి కంభం చంద్రశేకర్‌రెడ్డి


కార్యక్రమంలో పాల్గోన్న వైసీపి నాయకులు

**బ్రహ్మసముద్రం ఏప్రిల్ 08 ప్రభాతవార్త, :** మండలంలోని పిల్లలపల్లి, బ్రహ్మనముద్రం, ఎరడికెర, పడమటి కోడిపల్లి, భైరవానితిప్ప, గుండిగానిపల్లి, వేపులపర్తి గ్రామాలలో జగనన్న నువ్వే మానమ్మకం కార్యక్రమంను వైసీపి నాయకులు సచివాలయ కన్వినర్‌లు, గ్రుహసారదులు ఎంపిపి, కన్వినర్ బసవరాజు అధ్యక్షతన పార్టీ అదేశాల మేరకు, మంత్రి అశీస్సులతో కార్యక్రమంను ప్రారంభించారు. ప్రతి ఇంటికివెళ్ళి కార్యక్రమంను ప్రజలకు వివరించారు రాబోఏ ఎన్నికల్లో వైసీపిని జగన్‌అన్న ప్రజలకు చేసిన సేవలకు 2024 ఎన్నికల్లో వైసీపి పార్టీని గెలిపించాలని అన్నారు

## జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం..


పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

**శెట్టూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కెవి. ఉషాశ్రీ చరణ్ మంత్రి ఆశీస్సులతో శెట్టూరు మండలం ఎస్సీ కాలనీలోని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎక్స్ సర్పంచు బొమ్మాజీ రమేష్, హరినాథ్‌రెడ్డి, పోస్ట్ రామకృష్ణ, ఎంపిటిసి చెవులు కిష్టప్ప, ప్రతి ఇంటికీ తిరుగుతూ జగనన్న పాలన గురించి మంచి విషాలు తెలుసుకుని 50 గడపలు తిరిగి గత ప్రభుత్వం కన్నా మా జగనన్న సంక్షేమ పథకాలు మేలు ప్రజలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టైలర్ రాజు, సిటాకుల రామాంజినేయులు, రాజశేఖర్‌రెడ్డి, ఆనిమేటర్స్ శివలింగమ్మ, పార్వతి వాలెంటీర్స్ రమేష్, నరసింహప్ప, దొన్నపల్లి కిష్టప్ప, చెవుల మహేష్, యువరాజ్, ఎస్సీ కాలనీ యూత్ పాల్గొన్నారు.

## చిన్న పిల్లల ఆరోగ్యంపై వాకబు చేసిన డాక్టర్ వేణు కార్తికేయ


అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించిన వైద్యాధికారి

**శెట్టూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** వైద్యాధికారి డాక్టర్ వేణు కార్తికేయ చిన్నంపల్లి అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నపిల్లల ఆరగ్యోం గురించి వాకబు చేశారు. ప్రతి పిల్లవాడిని చూపి వారి ఆరోగ్య స్థితి తెలుసుకున్నారు. ఎండాకాలంలో పిల్లల పట్ల శ్రద్ధ తీసుకునే విధంగా వారి తల్లిదండ్రులకు చెప్పాలని అంగన్‌వాడీ టీచర్లకు చెప్పారు. ముఖ్యంగా వీధి కుక్కలు ఎండా కాలంలో దాహంతోనూ, ఆకలితోనూ ఏదిపడితే అది పిల్లల దగ్గర తీసుకోవడానికి ప్రయత్నం చేస్తాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లీలావతి, హెల్త్ అసిస్టెంట్ జాన్ సన్, ఎంఎల్‌హెచ్‌పి శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐని సన్మానించిన గ్రామస్తులు


ఎస్ఐని సన్మానిస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అరే సముద్రం గ్రామంలో ఊరి దేవర నిర్వహించిన సందర్భంగా గ్రామస్తులు శనివారం బొమ్మనహాళ్ ఎస్ఐ శివను దుశ్శాలువాతో పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో ఊరి దేవర సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా సహకరించినందుకు గ్రామం తరుపున ఎస్ఐ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల వాల్మీకి గౌరవాధ్యక్షులు అరెసముద్రం లక్ష్మినారాయణ, గ్రామ సర్పంచు తిప్పేస్వామి, వైస్ ప్రెసిడెంట్ సుధా, చీగలగుర్కి వన్నూరుస్వామి, మాజీ సర్పంచు తిప్పేస్వామి, ఆనంద్, ఈడిగ నాగరాజు, పూజారి శ్రీనివాసులు, గొల్లధనుంజయ్య పాల్గొన్నారు.

## నేడు పేరూరులో జరిగే వైఎస్ఆర్ ఆసరా విజయవంతం చేయండి

**కనగానపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :**

నేడు (ఆదివారం) 10 గంటలకు రామగిరి మండలం పేరూరు బస్టాండ్ సర్కిల్ వైఎస్ఆర్ ఆసరా మూడో విడత సంబరాలు జరగనున్నాయని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాష్‌రెడ్డి హాజరు కానున్నారని మండల వైకాపా కన్వీనర్ మామిళ్లపల్లి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. కనగానపల్లి మండలం నుంచి ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## యువగళం.. రైతు సదస్సుకు.. భారీగా తరలిన రైతులు


తరలి వచ్చిన రైతులు

**కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రలో భాగంగా శింగనమల నియోజకవర్గంలో చేపడుతున్న రైతు సదస్సుకు శనివారం అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచి ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడు ఆధ్వర్యంలో భారీగా రైతులు తరలి వెళ్లారు. నియోజకవర్గంలో వివిధ మండలాల నుంచి వందల సంఖ్యలో వచ్చిన రైతులు కళ్యాణదుర్గం పార్టీ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని ఇన్‌చార్జ్ ఉమా మహేమశ్వరనాయుడుతో కలిసి భారీ వాహన శ్రేణితో శింగనమల రైతు సదస్సుకు బయలుదేరి వెళ్లారు. రైతులతోపాటు అన్ని మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా ఈ సందర్భంగా ఉమా మహేశ్వర నాయుడు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఆదుకునే విషయంలో అన్ని విధాలా విఫలమైందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా విజయవం సాధించేది తెలుగుదేశం పార్టీనేనని స్పష్టం చేశారు. భవిష్యత్తు నారా లోకేస్ రైతులకు అన్ని విధాలా అండగా ఉంటారని ఉమా మహేశ్వరనాయుడు ధీమా వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన రైతులకు ఉమా మహేశ్వరనాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

## సమపాళ్ళలో...అభివృద్ధి...సంక్షేమం


జగనన్న కిట్లతో ఇంటింటికి సిద్ధమైన వైకాపా నాయకులు


పులకుర్తిలో వైకాపా నాయకుడు చంద్ర ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమం

**డి. హీరేహాళ్ ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సమర్థవంతుడైన మన సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మన రాష్ట్రంలో సమపాళ్ళలో అభివృద్ధి, అన్ని వర్గాల పెదల పాలిట సంక్షేమం ఏకకాలంలో ముందుకు సాగుతోందని వైకాపా మండల కన్వీనర్ వన్నూరు స్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సచివాలయం ఆవరణలో మండల జేఏసీ సచివాలయాల కన్వీనర్ రాళ్ళ తిమ్మారెడ్డి ఆ పార్టీ మండల మైనార్టీ నాయకుడు రహంతుల్లా, సీనియర్ నాయకుడు సింగాడి జగదీష్ తదితరులతో కలసి జగనన్నే మా నమ్మకం-మా భవిష్యత్తు జగనన్న కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్ళి జగన్న స్టిక్కర్లు అతికించి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, నవరత్నాల్లో బాగంగా ఇప్పటివరకు అన్ని వర్గాల ప్రజలకు, రైతులకు, నిరుద్యోగులకు అమలు పరచిన సంక్షేమ పథకాలు వివరించారు. మండలం పరిధిలోని 16 పంచాయతీలు, 11 సెక్రెటియేట్‌లలో జగనన్నే మా నమ్మకం- మా భవిష్యత్తు జగనన్న కార్యక్రమం సర్పంచులు, గృహసార్థులు, వలంటీర్లు వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆర్భాటంగా చేపట్టి ప్రజల కోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, పథకాలు వివరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా సిఎం విప్లవాత్మకమైన సంస్కరణలతో అందిస్తున్న సుపరిపాలన విదానంను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వివరించడమే లక్ష్యంగా వైకాపా సైన్యం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై, పార్టీపై ప్రజల అభిప్రాయాన్ని, ప్రజల సంతృప్తిని ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రజల అంచనాకు అనుగుణంగా పార్టీ అజెండా మార్చుకోవాలనుకునే సమర్థవంతమైన పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ కే సాధ్యమన్న విషయాన్ని ప్రజలకు వివరించడమే మాధ్యేమన్నారు. ఈ కార్యక్రమంను తూచా తప్పకుండ మండల పరిధిలోని అన్ని గ్రామాల వైకాపా గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులతో కలసి ఇంటింటికి తిరిగి జయప్ర దంచేస్తూ వైకాపా చెప్పిందే చేసింది చేసిందే చెపుతూ చూపిస్తోందని గర్వంగా చెప్పుకునే వేదికగా ఈ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ అభివర్ణించారు. పుకుర్తి సెక్రెటియేట్‌లో వైకాపా సీనియర్ నాయకుడు చంద్ర ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఎంపిటీసి సుజి మహేష్, విద్యాకమిటి ఛైర్మెన్ తొండ వెంకటేశులు, యాదవ సంఘం అధ్యక్షులు సురేష్‌యాదవ్, సింగాడి మంజునాథ్, నాగయ్య ఎరిస్వామి, శివారెడ్డి పాల్గొన్నారు.

## జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

**శెట్టూరు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మండలంలోని మాకొడికి గ్రామపంచాయితీలో రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి వర్యులు కెవి. ఉషాశ్రీ చరణ్ ఆదేశాల మేరకు, వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్, స్థానిక సర్పంచ్ ఎంపిటిసి, సచివాలయాల కన్వీనర్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు అనేక కార్యక్రమాన్ని మాకొడికి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సచివాలయాల కన్వీనర్ తీనార్మర్ తిమ్మరాజు విచ్చేసి కార్యక్రమం గురించి మాట్లాడుతూ.. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వవరిస్తూ గత ప్రభుత్వకి ఈ ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజల ద్వారానే తెలుసుకుని ఈ ప్రభుత్వంలో మీరు లబ్ది పొంది ఉంటే వచ్చే ఎన్నికల్లో మరల జగనన్నను, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి కెవి ఉషాశ్రీ చరణ్‌ని మరోఎసారి ఆశీర్వదించాలని ప్రజలకు కోరుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్, తిన్మార్ తిమ్మరాజు, వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ శివన్న యాదవ్, వైస్ ఎంపిపి ముత్యాలు, స్థానిక సర్పంచు సత్యనారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ మంజునాథ్‌రెడ్డి, వన్నూరుస్వామి, విజయ్‌నాయక్, చౌడప్ప, మాజీ సర్పంచు మాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఈద్గా మైదానంలో సౌకర్యాల కల్పన


అభివృద్ధి పనులను చైర్‌పర్సనర్ పరిశీలిస్తున్న దృశ్యం

**గుత్తి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** ముస్లింల పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని సామూహిక ప్రార్థనల నిమిత్తం ఈద్గా మైదానాన్ని మున్సిపల్‌చైర్‌పర్సన్ దంపతులు వన్నూర్‌బీ, వైకాపా పట్టణ కన్వీనర్ హుసేన్‌పీరాలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మైదానంలో వున్న రాళ్ల రప్పలు, కంపచెట్లను జెసిబితో తొలగిస్తున్నారు. సంవత్సరాల తరబడి ఎటువంటి అభివృద్ధికి నోచుకోక ఈద్గామైదానంలో ముస్లింలు నమాజ్‌చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వారు చొరవ తీసుకుని ఈద్గా మైదానంలో అభివృద్ధి పనులు చేపట్టారు. శనివారం చైర్‌పర్సన్ ఆయా పనులను పర్యవేక్షించారు. ఈ కార్య క్రమంలో షఫి, మహబూబ్‌బాష, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

## పాతపాళ్యంలో పార్టీకి పూర్వవైభవం

**-సిపిఎం పార్టీ కర్నాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవరాజు**


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అనిల్


ఐక్యతతో గెలిపిద్దామని లాల్ సలాం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

**చిలమత్తూరు, ఏప్రిల్ 8 ప్రభాత వార్త :** బాగేపల్లి తాలూకా పాత పాళ్యం హోబ్లిలో సిపిఎం పార్టీకి పూర్వవైభవం వచ్చిందని సిపిఎం పార్టీ కర్నాటక రాష్ట్ర కార్యదర్శి బసవరాజు అన్నారు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి బసవరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి మునివెంకటప్పల ఆధ్వర్యంలో గతంలో వివిధ కారణాల చేత పార్టీకి దూరంగా వున్న పూర్వ నాయకులు, పలువురు ప్రముఖులు సిపిఎం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ "ప్రజల కోసం సిపిఎం - సిపిఎం కోసం ప్రజలు" నినాదంతో పార్టీ ముందుకు పోతుందని అభివృద్ధే అజెండాగా పార్టీ తీసుకున్న విధానంతో పూర్వనాయకులు, కార్యకర్తలు ముందుకు వచ్చి పార్టీలో చేరి ఎర్రజెండాకు అండగా నిలవడంతో పార్టీ నిండుగా మారిందన్నారు. కమ్యూనిస్టు పార్టీని గెలిపించుకోవడానికి అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే గూళూరు హోబ్లీలోని కొత్తకోట, మారగానకుంట్ల పంచాయతీలో ప్రచారం కొనసాగింది. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కళాజాత పలువురిని ఆకట్టుకుంది. పార్టీలో చేరిన ప్రముఖుల్లో అమర్‌నాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి (గుజ్జేపల్లి), శ్రీనివాసులు (గుడిపల్లి), నంజుడప్ప (గుండువారపల్లి), మునెప్ప, అంజినప్ప, అదినారాయణ, క్రిష్టప్ప, సురేంద్ర, వెంకటేష్, సంతోష్, నంజుడప్ప, అంజి, అనిల్‌లు వున్నారు. ప్రచార కార్యక్రమంలో సిపిఎం తాలూకా నాయకులు రఘురాంరెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామప్ప, ఓబుళరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రన్ ఫర్ జీసస్


కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**హిందూపురం టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** పట్టణంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్య క్రమాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఒన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఈరన్న ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ వేడుకల ప్రాముఖ్యతను లోకానికి చాటిచెప్పడం కోసం సి అండ్ ఐజి మిషన్ కాంపౌండ్ చర్చ్ హిందూపురం వారు ఫాస్టర్ ఫెలోషిప్స్ సహకారంతో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు. యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడం కోసం, క్రైస్తవుల ఐక్యతను చాటి చెప్పడం కోసం హిందూపురం పట్టణ వీధుల్లో యేసుక్రీస్తు ప్రేమ సువార్తను చాటిస్తూ సమస్త మానవాళి కొరకు క్రీస్తు శిలువలో చేసిన ప్రాణత్యాగం మూడవ రోజు పనరుత్తానుడైన విశిష్టతను చాటి చెప్పారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధానకూడళ్లలో దేశంకోసం, రాష్ట్రంకోసం, శాంతిభద్రతల కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఫాస్టర్ ఫెలోషిప్స్, ప్రెసిడెంట్‌లురెవరెండ్ డాక్టర్ఎన్.డేవిడ్, రెవరెండ్ యస్.సూర్య ప్రకాష్, సి అండ్ ఐజి మిషన్ కాంపౌండ్ చర్చ్ ఫాస్టర్ రెవరెండ్ స్టీఫన్‌రాజ్, సెక్రటరీ నాగేంద్రకుమార్, ట్రెజరర్ ఆదర్శ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ క్రిస్టఫర్, జాయింట్ ట్రెజరర్ ఎస్‌హెచ్ ఆనంద్‌రాజ్, డికెన్లు విక్టర్‌జాషువా, జాన్సన్, జార్జ్‌బాబు, హిందూపురం ఫాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

## విస్తృతంగా మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం


ప్రజలకు పథకాలను వివరిస్తున్న నాయకులు

**పెనుకొండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని శనివారం ఆ పార్టీశ్రేణులు విస్తృతంగా చేపట్టారు. పెనుకొండ నగర పంచాయితీ పరిధిలోని జిఐసి కాలనీ, మహాదేవపల్లి, వెంకటరెడ్డిపల్లిలో చైర్మన్ ఉమర్ ఫరూఖ్, వైస్ చైర్మన్ వైశాలి జయశంకర్‌రెడ్డి, సునీల్‌కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లిప్రజలను కలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన స్టిక్కర్లు, కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగనన్నే మా భవిష్యత్ అనే నినాదంతో ప్రజలతో మమేకం అవ్వడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వాలకు జగన్ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని వారు కోరారు. నవరత్నాలు పథకాలు ద్వారా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందంచిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలందరూ జగన్ను ఆశీర్వదించాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బోయ నరసింహులు, అగ్రి చైర్మన్‌కొండల రాయుడు, 17వ వార్డు కౌన్సిలర్ రామాంజినేయులు, తిమ్మారెడ్డి, బోయబాబు, శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రాము, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

## బళ్లారి రూరల్ క్షేత్రంలో శ్రీరాములు ప్రచారం జోరు


ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి శ్రీరాములు

**బళ్లారి, ఏప్రిల్ 08, ప్రభాతవార్త ;** బళ్లారి రూరల్ క్షేత్రం పరిధిలోని పలు గ్రామాల్లో బీజేపీ రూరల్ అభ్యరి , మంత్రి శ్రీరాములు జోరుగా ప్రచారం చేపట్టారు. రెండు, మూడు రోజులుగా క్షేత్రం పరిధిలోని స్థానిక కౌల్‌బజార్ ప్రాంతంలో కొందరు ముస్లీం ప్రముఖులను, కాంగ్రెస్‌కు చెందిన సీనియర్ నాయకులను కలిసి వారితో భేటీ చేసి తన గెలుపుకు సహకరించాలని విజ్ఞప్తి చేయడం విశేషం. తాలూకాలోని కారేకల్ గ్రామంలో వీరభద్రేశ్వర జాతర మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఇదే సందర్భంలో స్థానిక ప్రజలతో కలిసి రథం లాగారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను పలకరిస్తూ ఈసారి ఎన్నికల్లో తనకు మద్దతునివ్వాలని ఓటు వేసి గెలిపించాలని కోరుతుండడం కనిపించింది. స్థానిక నాయకులతో పాటు మాజీ ఎంపీ సన్నఫక్కీరప్ప, బీజేపీ రాష్ట్ర రైతుమోర్చా ప్రధాన కార్యదర్శి ఎస్.గురులింగన్నగౌడ, జిల్లా ఉపాధ్యక్షుడు ఓబులేష్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతులను పొలంలోనే సన్మానించిన జై కిసాన్ ఫౌండేషన్

**-రైతుల కష్టాన్ని కొనియాడిన నాగమల్లి ఓబులేష్**


పొలంలోనే మహిళా రైతులను సన్మానించిన జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్

**ఉరవకొండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** మంచి పంట దిగుబడి సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న వజ్రకరూరు మండలం గంజికుంట గ్రామానికి చెందిన యువ రైతు దంపతులు అమృత్ సాగర్, అమృతవాణిలను జై కిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ మిరప పంట పొలంలోనే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ రైతు దంపతులు ఆదర్శవంతమైన వ్యవసాయ విధానాన్ని కొనసాగించి తమకున్న 10 ఎకరాల భూమిలోనే విభిన్న రకాల పంటలైన బొప్పాయి, దానిమ్మ, చెరుకు, అల్లనేరేడు, అనప, మిరప, వేరుశెనగలతోపాటు కూరగాయలను సాగు చేస్తూ అధిక దిగుబడులను సాధిస్తున్నారన్నారు. ఆయా పంటలు సాగు చేయగా మిగిలిన ఒకటిన్నర ఎకరం పొలంలో గత ఏడాది సెప్టెంబర్‌లో డబ్బి రకం ఎర్ర మిరప పెట్టారని ఇప్పుడు పంట కోతలు జరుగుతున్నాయని ఒకటిన్నర ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోందన్నారు. మిరప నారు నాటినప్పటి నుండి పంట కోత వరకు ప్రతి వారం జై కిసాన్ ఫౌండేషన్ బృందం పొలాన్ని సందర్శించి రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గేలా, నీటి, పోషక యాజమాన్య పద్దతులను, పంటకు ఆశించే పురుగులు నల్లి, తెగుళ్ల నివారణ చర్యలను తెలియడం జరిగిందన్నారు. అవసరం మేరకే రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడాలని సూచిస్తూ సేంద్రీయ, న్యాచురల్ ఫార్మింగ్ పద్దతులను నేర్పించడం జరిగిందని వాటి ఫలితాలు నేడు కనిపిస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రైతు దంపతులు జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరోగ్య ఉప, అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ చేసిన డెప్యూటీ డెమో

**-సిబ్బందికి పలు సూచనలు చేసిన త్యాగరాజు**


ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డెమో త్యాగరాజు

**ఉరవకొండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** రాకెట్ల, పి.కొంకుంట్ల పీహెచ్‌సీల పరిధిలో వివిధ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ వ్యాధి నిరోధక టీకాల పర్యవేక్షణ అధికారి, డెప్యూటీ డెమో త్యాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనాలు చేశారు. వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీ స్త్రీల ఐరన్ ఫోలిక్ మాత్రల పంపిణీ, స్టాక్, రక్తహీనత తదితర అంశాలపై ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐరన్ మాత్రలు తగినంత నిల్వ ఉంచుకొని గర్భవతులకు అందజేయాలని రక్తహీనత రాకుండా చూడాలని సూచించారు. గర్భవతులు సరైన పోషకాహారం తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాకెట్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.యండి.షఫీ, సీహెచ్ఓ నాగరంగయ్య, పి.కొంకుంట్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ యు.వెంకటరమణ, సీఓ భగవాన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్న ఊళ్లోనే కూలీలకు పనులను కల్పించకపోవడంతోనే ప్రమాదాలు

**- మృతి చెందిన కూలీ గంగన్న కుటుంబానికి రూ.20 లక్షల పరిహారమివ్వాలి - సీపీఎం పార్టీ నాయకులు ఎన్.మధుసూదన్, ఎ.రంగారెడ్డి డిమాండ్**


గంగన్న మృతదేహాన్ని ఆసుపత్రిలో పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు ఎన్.మధుసూదన్, ఎ.రంగారెడ్డి తదితరులు


కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు తెలుసుకొంటున్న దృశ్యం

**ఉరవకొండ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** కూలీలకు వారి ఊళ్లలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించకపోవడంతోనే వారు పొట్టకూటికోసం ఇతర గ్రామాలకు వెళుతూ ప్రమాదాలకు గురి మృత్యువాత పడటమో లేక గాయాలపాలై అంగవైకల్యం పొందటమో జరుగుతున్నాయని వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్.మధు సూదన్, జిల్లా కమిటీ సభ్యులు ఎ.రంగారెడ్డి వాపోయారు. పట్టణ శివారు ఈద్గా వద్ద వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో బోల్తాపడి పీసీ ప్యాపిలి కొత్తకోట గ్రామానికి చెందిన కూలీ ముండ్ల గంగన్న మృతి చెందగా పలువురు గాయపడిన విషయం తెలియగానే వారు స్థానిక ప్రభుతాసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి గాయపడిన వారి గుర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని ప్రభుత్వాలు చెబుతున్నాయని అయితే వాస్తవానికి క్షేత్రస్థాయిలో గిట్టుబాటు అయ్యే కూలీతో పనులు చేపట్టడంలేదన్నారు. ఉపాధిహామీ కూలీ గిట్టుబాటు కాకనే అనేక మంది పంట కోతలకు ప్రమాదమని తెలిసినా ఆటోలు, ఇతరత్రా వాహనాల్లో వెళ్లి మృత్యుఒడికి చేరుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రమాదంలో గాయపడిన గంగన్న కుటుంబానికి 20 లక్షల రూపాయలు పరిహారం అందించాలని, గాయపడిన వారికి లక్ష రూపాయలు పరిహారం అందించామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాదాలు జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి :**

పొట్టకూటి కోసం కూలి పనులకు వెళుతున్న కూలీలు ప్రమాదాలకు గురికాకుండా వారు అధికంగా ప్రయాణించే ఆటోల ఫిట్‌నెస్, వాటి డ్రైవర్లకుగల అర్హతపై పోలీసులు, ఆర్టీఓ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించాలని సామాజిక కార్యకర్త పాల్తూరు ఆనంద్‌రాజు కోరారు. ఆటో బోల్తాపడి వ్యవసాయ కూలీ దళిత సామాజికవర్గానికి చెందిన గంగన్న మృతి చెందిన పలువురు గాయపడిన విషయం తెలియగానే ఆయన ఆసుపత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి క్షతగాత్రులను పరామర్శించారు. పరిమితికి మించి ప్రయాణీలతో, అతివేగంగా, మద్యం సేవించి కొందరు ఆటోలు నడుపుతుండటంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ఈ కార్యక్రమంలో కోనాపురం ఎర్రిస్వామి, కొనకొండ్ల చిన్న అంజి. శంకర, దండోరా జిల్లా ఉపాధ్యక్షులు బెంజిమన్, సోనియా శీనా తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే పై లోకేష్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన వైసీపీ నేతలు

- నారా లోకేష్ దిష్టి బొమ్మ దహనం



నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైసీపీ నాయకులు

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 8 ప్రభాతవార్త

టీడీపి యువగళం పాదయాత్ర బహిరంగ సభలో నారా లోకేష్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పదాత్మవతి,రాష్ట్ర ప్రభుత్వ విద్యాసలహాదారులు ఆలూరి సాంబశివారెడ్డి పై చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు.శనివారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో వైసీపీ ప్రజాప్రతినిదులు,నాయకులు కార్యకర్తలు మీడియా సమావేశం నిర్వహించారు.ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం నారాలోకేష్ దిష్టిబొమ్మను దహనం చేసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగ ప్రజా ప్రతినిదుల మాట్లడుతు నియోజకవర్గంలో ప్రతి మండలానికి ఒక నాయకుడు ఉన్నాడు అదే పార్టీ విదానం,బహుశా ఈ విదానం మీకు తెలియదేమో ఒక్కసారి మీ నాయకులను మీ నాన్నని అడిగి తెలుసుకోవార్డు మెంబర్‌గా కూడ గెలవలేని నీకు ఇలాంటి విషయాలు తెలిదేమోన్నారు. మీ నాన్నకి 40 సంవత్సరాలు ఇండ్రస్టీ,14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేశారు.నియోజకవర్గం ఏమి అభివృద్ధిచేశారో చెప్పమనండి,అదే జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత మా ఎమ్మెల్యే గెలిచినతరువాత నియోజకవర్గంలోని అన్ని చెరువులను నీటితో నింపిన ఘనత ఎమ్మెల్యే పద్మావతి కి దక్కుతుందన్నారు.నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకొని వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతాఉందన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో లేరని అన్నారు.కరోనా సమయంలో మీ తండ్రి జూమ్‌లో తప్ప ఎక్కడైనా కనిపించార అనే విషయాన్ని గుర్తుపెట్టుకొని మాట్లాడాలన్నారు. ఇప్పుడు సవాల్ విసురుతున్నాం నియోజకవర్గం ఎవరి హయ్యాంలో అభివృద్ధి చెందిందో ప్రజలే చెపుతారు మేము చేసిన అభివృద్ధి కండ్లకు కనపడుతుంది.శింగనమల చెరువు లోక్‌లైజేషన్ చేసి చూపించామన్నారు.ఇలా చెపుకుంటూ పోతే నియోజకవర్గంలో ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమలాలు చూపిస్తామని సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కి అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళు నవరత్నాలు ప్రవేశపెట్టి గ్రామాల్లో 90 శాతం కుటుంబాలు లబ్దిపొందాయన్నారు.ఇంకొకసారి మా ఎమ్మెల్యే పై ఆరోపనలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటీసీ నీలం భాస్కర్,ఎంపిపి సునీత,సర్పంచు పార్వతి,సింగిల్ విండోఅధ్యక్షులు గువ్వల పెద్దవెంకటరెడ్డి,జెసిఎస్ మండల కన్వీనర్ పసులూరు బయపరెడ్డి,నరేష్,ముత్యాలుశీనా,నందినేని మల్లి, పురుషోత్తం,పెద్దకొండయ్య,బుల్లే నారాయణస్వామి, మనేరికొండమ్మ, వైస్‌ఎంపిపిలు సాకేలక్ష్మినారాయణ,రంగా(రాయల్).జంతులూరు రామ్మెహన్‌రెడ్డి,చెదుళ్ళ శ్రీనివాసురెడ్డి, బుల్లేరాజ,డీలర్లు భాస్కర్,సత్తి,శేషానందరెడ్డి,రాజరెడ్డి,ప్రసాద్,చినపరెడ్డి,గంగరాజు,నాగరాజు, తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు తదితిరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకో..

- వైకాపా జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం సిటీ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

యువగళం పేరుతో పాదయాత్ర చేపడుతున్న నారా లోకేష్ వైసీపీ నేతలను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకోవాలని వైకాపా జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య హెచ్చరించారు. జిల్లా వైకాపా కార్యాలయంలో వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైలా నరసింహయ్య మాట్లాడుతూ.. నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర ప్రజల నుంచి స్పందన లేక అట్టర్‌ప్లాప్ అయిందన్నారు. టీడీపీ నేతలు వాహనాలు ఏర్పాటు చేసి ప్రజలను తరలిస్తున్నా స్పందన కనిపించడం లేదన్నారు. దీంతో ఫ్రస్టేషన్‌తో నారా లోకేష్ ముఖ్యమంత్రిపైన, ఎమ్మెల్యేలపైన ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారన్నారు. నారా లోకేష్ ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ మాట్లాడుతూ.. శిగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. ఉన్నత విద్యా వంతురాలైన జొన్నలగడ్డ పద్మావతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మూడున్నరేళ్ల పాలనలోనే అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే పద్మావతి ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. అదే విధంగా ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డ ఎంతో ఉన్నత మనస్సుతో దళిత మహిళ అయిన జొన్నలగడ్డ పద్మావతిని వివాహం చేసుకుని ఆదర్శంగాఉన్నారన్నారు. అలాంటి వారిపై విమర్శలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని విమర్శించారు. అదే విధంగా టీడీపీ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ తండ్రిపై టీడీపీ టూమెన్ కమిటీ కుటుంబీకులు దాడి చేస్తే నారా లోకేస్ ఖండించ లేదన్నారు. దళితులకు క్షమాపణ చెప్పి జిల్లా దాటాలని లేదంటే దళితులసత్తా ఏమిటో చూడాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## మంచి చేసే ప్రభుత్వానికి అండగాఉంటాం

- కార్పొరేటర్ మీనాక్షమ్మ

అనంతపురం సిటీ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త



లబ్దిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న కార్పొరేటర్ మీనాక్షమ్మ

పేదప్రజల అభ్యున్నతి లక్ష్యంగా మంచి చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి అండగా ఉందామని 26వ డివిజన్ కార్పోరేటర్ మీనాక్షమ్మ సూచించారు. మా నమ్మకం నువ్వే జగనన్న, మా భవిష్యత్తు నువ్వే జగనన్న కార్యక్రమాన్ని డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు చేరిన మేలును వివరించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా గడప వద్దకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రజా ఆశీస్సులతో అనంతపురం నగరంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు అధికారంలోకి వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు నాగార్జునరెడ్డి, అలీఖాన్, వెంకటరెడ్డి, రామకృష్ణ, వలి, హనుమంతరెడ్డి, మోసెస్, నరేష్, శ్రీనాథ్‌రెడ్డి, మహిళా నేతలు లక్ష్మిదేవి, రమీజా, వెంకటలక్ష్మితోపాటు కన్వీనర్లు, గృహ సారథులు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## మా నమ్మకం నువ్వే జగనన్న

-ఆలూరు సాంబశివారెడ్డి



మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

నార్పల రూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత గృహ సారథులు మరియు వాలంటీర్లపై వుందని ప్రభుత్వ విద్య సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాలుగు సచివాలయాల వాలంటీర్లతో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై మండల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని బండ్లపల్లి, బి.పప్పూరు పలు సచివాలయాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాలుగా జగనన్న అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు తెలియచేయాలన్నారు. వాలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేసి మరొకసారి వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. గృహ సారథులు, వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డుచైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ నిట్టూరు రఘునాథరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమి చైర్‌పర్సన్ హరిత రాజగోపాల్, జెడ్‌పివైస్‌చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, సర్పంచు మన్నిల సుప్రియ, ఉపసర్పంచు గవ్వల శ్రీరాములు, వైసిపి కార్యకర్తలు మన్నెల శివయ్య, చికెన్ గోపాల్, బాలనాగ బాలకృష్ణ, గిరక పెద్దన్న, బారిక నరసింహ, పల్లె భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఎనిమిది గొర్రెలు, ఇద్దురు యువకులు మృతి





రోడ్డుప్రమాదంలో సంతోష్,గొర్రెలు

ఆత్మకూరు ఏఫ్రిల్ 8 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఆత్మకూరు సమీపాన తెల్లవారుజామున అటోను గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఎనిమిది గొర్రెలు,ఇద్దరు మృతి చెందారు.పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కళ్యాణదుర్గం మండలం గోళ్ళ గ్రామానికి చెందిన సంతోష్ అటోలో గొర్రెలు వేసుకొని అనంతపురం మార్కెట్‌కు వెళ్తుండగా ఆత్మకూరు సమీపాన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సతీష్(25) అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడన్నారు.ఆటోలో ఉన్న ఓబులేసు,శీనప్ప,నందు,ముగ్గురుకు తీవ్రగాయాలయ్యాన్నారు. ఆటోలో తీసుకెస్తున్న గొర్రెలులో 8 గొర్రెలు మృత్యువాత పడ్డాయన్నారు. తీవ్రంగా గాయడిన క్షతగాత్రును చికిత్స నిమిత్తం అనంతపురంకు తరలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నందు (18) అనే యువకుడు కూడా మృతి చెందాడని తెలిపారు.ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని 'దర్యాప్తు చేస్తామన్నారు.

## రన్ ఫర్ జీసస్ ర్యాలీలో భారీగా పాల్గొన్న క్రైస్తవులు




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

శనివారం అనంతపురంలోని సిఎస్ఐ చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ర్యాలీని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో క్రైస్తవులు వెయ్యి మందికిపైగా పాల్గొని రన్‌ఫర్ జీసస్ ర్యాలీని విజయవంతం చేశారు. ఈ ర్యాలీలో అనంతపురం పట్టణంలోని అన్ని చర్చిల నుంచి క్రైస్తవులు పాస్టర్లు, క్రైస్తవ నాయకులతోపాటు గౌరవ అతిథులు ఉర్దూ అకాడమి చైర్మన్ నదీమ్ అహ్మద్, నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత రాజగోపాల్, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కొగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సిపి సీనియర్ నాయకులు చవ్వా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చామలూరు రాజగోపాల్ పట్టణంలోని క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ర్యాలీలో కన్వీనర్ కాంతి జాన్‌వెస్లీ రన్ ఫర్ జీసస్ అనే నినాదాలతో ర్యాలీ మొత్తం హోరెత్తించారు. ఈ ర్యాలీ సీఎస్ఐ చర్చి నుంచి ప్రారంభమై కోర్టు రోడ్డు క్లాక్ టవర్ సప్తగిరి సర్కిల్ మీదుగా ఎస్ఐయు చర్చి వద్ద ముగించారు. ఈ సందర్భంగా రన్‌ఫర్ జీసస్ కమిటీచైర్మన్ బెన్హర్, కో చైర్మన్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు మరణాన్ని గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నెహెమ్యా నాగరాజు, తిమోతిరావు, రఘునాథ్‌డేనియల్, వరప్రసాద్‌రెడ్డి, హాజరై ర్యాలీలో యేసు క్రీస్తు మరణం గురించి తెలియజేశారు. ఈ ర్యాలీలో రన్‌ఫర్ జీసస్ కోఆర్డినేటర్స్ అనిల్‌కుమార్, కొఠారి విక్టరీ డేనియల్, కన్వీనర్స్ కాంతి జాన్ వెస్లీ, ఆదాము, విల్సన్, టిడిపి క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాస్, పాస్టర్లు ఆనంద్, మనష్షే, బిందెల రాజు, పట్టణంలోని క్రైస్తవులు పెద్ద ఎత్తున పాల్గొని రన్ ఫర్ జీసస్ ర్యాలీని విజయవంతం చేశారు.

## మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ప్రారంభించిన రాప్తాడు ఎంపిపి



మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యాలు

రాప్తాడు, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో మా నమ్మకంనువ్వే జగనన్న కార్యక్రమాన్ని రాప్తాడు ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజల దగ్గర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన గురించి అడిగి తెలుసుకుంటూ అదే విధంగా పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు లోకేష్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, మహిళా విభాగం ఉషారాణి, సచవాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువ ఇంజనీర్ అకాల మృతి బాధాకరం

- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మార్చురీలో భౌతికకాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

అనంతపురం రూరల్ మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ చింతపంటి మంజిత్‌కుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బెంగుళూరు నుంచి బైక్‌లో వస్తూ శుక్రవారం రాత్రి కనగానపల్లి మండలం దాదులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం ఉదయం అనంతపురం సర్వజన ఆసుపత్రి మార్చురీలో భౌతికకాయాన్ని పరిశీలించారు. కుటుంబసభ్యులతో మాట్లాడారు.

## లోకేష్‌నాయుడు.. నీ పాదయాత్ర ఎవరి కోసం

- కరోనా సమయంలో నీ తండ్రి.. నీవు ఎక్కడున్నారు
- నిత్యం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేతలు

శింగనమల, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

నీ పాదయాత్ర ఎవరి కోసం చేస్తున్నావో.. చెప్పాలని వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్ , నారా లోకేష్‌ని విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోనిర్వహించిన పత్రికా సమావేశంలో వైసీపీ మండల కన్వీనర్ పట్నం నగేష్ మాట్లాడుతూ.. యువగళం పాదయాత్ర సింగనమలమండలం గార్లదిన్నె మండలం యువగళం బహిరంగ సభలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డిపై నారా లోకేష్ చేసిన విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నిత్యం ప్రజల కోసం, ప్రజల్లో ఉంటూ వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాకమునుపు 155 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను దగ్గరుండి చూసి ఎమ్మెల్యే అయిన తర్వాత దశాబ్దాల చరిత్ర తిరగరాసి శింగనమల చెరువును లోకలైజేషన్ చేసిన ఘనత ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త సాంబశివారెడ్డిదని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాగునీటికి, సాగునీటికి ప్రజలు ఇబ్బంది పడిన దృశ్యాలు మరిచి పోయాకరా, నేడు నియోజకవర్గంలోని అన్ని మండలాల చెరువులను నింపి ఆయకట్టుకు నీరు అందించిన ఘనత మా ఎమ్మెల్యేది అన్నారు. ఏ మండలానికైనా ఒక నాయకుడు ఉండటం ఆనవాయితీ అని మీ లాగ జన్మభూమి క మిటీల పేరుతో దోచుకోలేదని విమర్శించారు. ఎస్ఆర్ఐటి కళాశాల స్థాపించి నియోజకవర్గంలో ఎంతో మందికి విద్యాదానం చేసిన ఘనత వారికి దక్కిందని, చివరికి నియోజకవర్గ దళితుల నియోజకవర్గంలో ఎవరికి పెత్తనం ఇచ్చారో మీకు తెలియదా, అగ్రవర్ణాలైన కమ్మ, రెడ్లకు పెత్తనం ఇచ్చింది మరిచారా అని విమర్శించారు. ఇప్పటికైనా నారా లోకేష్ పద్ధతి మార్చుకోవాలన్నారు.

### మరోసారి విమర్శలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు : గాండ్ల కార్పోరేషన్ డైరెక్టర్ నరసయ్య

జన్మభూమి కమిటీ ఏర్పాటుచేసి గ్రామాల్లో పింఛన్ల మంజూరు కొరకు, గృహాల మంజూరు కొరకు డబ్బులు వసూలు చేసిన చరిత్ర మీదని, ఈ రోజు పాదయాత్ర చేస్తున్న రోడ్డు వేసింది ఎవరో అడిగి తెలుసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బిసిలను ఓట్ల కోసం వాడుకోవడం తెలుగుదేశం పార్టీలకు అలవాటు అన్నారు.

### నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు.. : వైసిపి నాయకుడు చెన్నకేశవులు

ఎమ్మెల్యే కనిపించడం లేదని నారా లోకేష్ అనడాన్ని మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండి, వారి సమస్యలు తీర్చుతున్నారని, అటువంటి ఎమ్మెల్యే గురించి అవాకులు చవాకులు పేలితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

### ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదవడం మానుకో.. : రైతు సంఘం నాయకులు ఎన్‌వి.నారాయణ

ఎవరో రాసిచ్చిన స్క్రిప్టు చదవడం నారా లోకేష్ మానుకోవాలని, స్వయంగా తెలుసుకుని మాట్లాడాలని రైతు సంఘం నాయకులు ఎన్‌వి.నారాయణ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణాల మాఫీ, జాబు రావాలంటే బాబు రావాలని వాగ్దానాలు ఇచ్చిన మీ తండ్రి నారా చంద్రబాబునాయుడు మహిళలకు డ్వాక్రా రుణాలు మాఫీ చేశారా తెలుసుకో.. ఇంటింటికీ ఉద్యోగం ఇచ్చి ఉంటే.. నేడు నీకు ఈ యువగళం పాదయాత్ర ఎందుకు, రైతు రుణమాఫీ చెప్పి రైతులను నిండా ముంచినది మీ తెలుగుదేశం పార్టీ కాదా.. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. కరోనా సమయంలో సొంత నిధులు 50లక్షలు ఖర్చు పెట్టి ఎమ్మెల్యేజొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డిలు కోవిడ్ సెంటర్ ఏర్పాటు చేసి ఆక్సీజన్ సిలెండర్లు అందించారని, అన్ని మండలాల్లోని పంచాయితీ కార్మికులకు, జర్నలిస్టులకు సైతం నిత్యావసర సరుకులు అందించిన ఘనత వారిదని , కోవిడ్ భయంతో రాష్ట్రం విడిచి తెలంగాణాలో తలదాచుకున్నది మీరు కాదా అని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులను మాట్లాడే సమయంలో వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, భాస్కర్‌రెడ్డి, జెఎఎస్‌ఈ కన్వీనర్ రమణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఓబుపతి, సి.కుమార్‌రెడ్డి, వెస్ట్ నర్సాపురం సర్పంచు వెంకటరమణ, మల్లికార్జునరెడ్డి, పుల్లప్ప, ముచ్చుకోట శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్ర, డీలర్ ఆది, జగన్‌మోహన్‌రెడ్డి, సి.శరత్‌రెడ్డి, శింగనమల గ్రామ ఉపసర్పంచు లక్ష్మినారాయణరెడ్డి, ఎల్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు 325 మంది గైర్హాజరు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షలకు 325 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 139 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరిగిన పదో తరగతి రెగ్యులర్ పరీక్షకు 29951 మంది విద్యార్థులు హాజరు కావలసిన ఉండగా 2962 మంది మాత్రమే హాజరై మిగిలిన 325 మంది గైర్హాజరయ్యారని డిఈఓ ఎం.సాయిరామ్, ఏసి గోవిందనాయక్ తెలిపారు. ఈడీఓ 5 కేంద్రాలను, ఏసి ఒకటి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 42 కేంద్రాలను తనిఖీ చేయడం జరిగింది.

## 10వ తరగతి పరీక్షలను తనిఖీ చేసిన ఫ్లయింగ్‌స్క్వాడ్

యాడికి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఏ, బి కేంద్రాలతో పాటు ప్రైవేటు పాఠశాల వాగ్దేవిలో శనివారం 10వ తరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థులను ఫ్లయింగ్‌స్క్వాడ్ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం ముఖ్యఅధికారి చంద్రనాయక్ జిల్లా కేంద్రం నుండి వచ్చినట్లు సిబ్బంది తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా వ్రాయాలని వారు తెలియచేశారు.

## బిసి అభ్యర్థిని ముఖ్యమంత్రిగా ప్రకటించాలి

- రాజకీయ పార్టీలకు డా.పోతుల నాగరాజు డిమాండ్

అనంతపురం, ఏప్రిల్ 8 ప్రభాతవార్త బ్యూరో



మాట్లాడుతున్న పోతుల నాగరాజు

సామాజిక న్యాయం పేరుతో బిసిలకు మోసం తప్పా న్యాయం ఎక్కడ జరుగుతున్నదో సమాధానం చెప్పాలని రాజకీయ పార్టీల అధ్యక్షుడు రిజర్వేషన్ల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షులు ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడతూ.. అధికారం కోసం పాదయాత్రలు చేపడుతున్న మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరి అభివృద్ధి కోసం మీరు పని చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. అన్ని పార్టీలు కేవలం 56 శాతం మంది ఉన్న బిసిల ఓట్ల కోసమే ఎన్నికల సమయంలో బిసిలకు అనేక హామీలను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ నెల 23న అనంతపురంలోను, మే 14న ఉత్తర ఆంధ్ర జిల్లాల ముఖ్య నేతల సమావేశంను విశాఖపట్నంలోను, మే 28న కోస్తా జిల్లాల ముఖ్య నేతల సమావేశం విజయవాడలో ఏర్పాటు చేయాలని నిర్ణయిస్తూ, ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను రాజకీయ పార్టీల అధ్యక్షుల దృష్టికి రిజర్వేషన్ల పరిరక్షణ సమితి తీసుకెళ్తుందన్నారు.

## రాష్టానికి మార్గదర్శకులు జగన్మోహన్‌రెడ్డి

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ భోగాతి



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ భోగాతి

పామిడి, ఏప్రిల్ 08 ప్రభాతవార్త

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకెళ్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి చేయూతనను అందిస్తూ మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిదిలోని ఖాదర్‌పేట, దేవరపల్లి, గజరాంపల్లి సచవాలయాల్లో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి ప్రారంభించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లుతో కలిసి ప్రతిఇంటికి వెళ్ళిన ఎంపీపీ భోగాతి ముళీమోహన్‌రెడ్డి జగనన్నే మా భవిష్యత్తు మా నమ్మకం నువ్వే జగన్ అంటూ ముద్రించిన ప్రభుత్వ బ్రోచర్లు, ముఖ్యమంత్రి సందేశ పత్రాలను అందజేసి స్టిక్కర్లను అతికిస్తూ నాలుగేళ్ళలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సాధించిన ప్రగతిని వివరిస్తూ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా ప్రజాభ్యున్నతిని ఆకాంక్షిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వార ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలే రాబోవు ఎన్నికల్లో వైసీపీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని తద్వార మరో 30 ఏళ్ళు ఆయన ముఖ్యమంత్రిగా ఉంటారని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో వైసీపీ రూరల్ సచివాలయ కన్వీనర్ ఎన్నారై కుమార్‌రెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, రమణారెడ్డి, నక్కా ఓబులేసు, బైపిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శంకర్, శ్రీనివాసులు, ఓబుళప్ప, ప్రతాఫ్‌రెడ్డి, ఓబులేసు, గృహసారధులు, వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

## వాల్మీకి బోయ సంఘం నగర అధ్యక్షులు నాగార్జున

అనంతపురం, ఏప్రిల్ 8, ప్రభాతవార్త ప్రతినిధి



నల్లపోతుల నాగార్జున



బడమల విశ్వనాథ్

ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఎపివిబిఎస్) అనంతపురం నగర అధ్యక్షులుగా నల్లపోతుల నాగార్జున నియమితులయ్యారు. శనివారం రాష్ట్ర కమిటీ నుంచి నాగార్జునను నియమిస్తున్నట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. నగర కార్యదర్శిగా బడమల విశ్వనాథ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నగర యువత అధ్యక్షులు నాగార్జున మాట్లాడుతూ నగర వాల్మీకుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తమ మీద నమ్మకంతో రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఈ బాధ్యతను నెరవేర్చుకుంటామని తెలిపారు. పేరుపేరునా రాష్ట్ర కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## దళిత నియోజకవర్గ ఇన్‌చార్జ్ తండ్రిపైనే దాడి అప్రజాస్వామికం

- టీడీపీలో దళితులకు రక్షణ కరువు
- ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎగ్గుల శ్రీనివాసులు

అనంతపురం సిటీ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త

టిడిపి అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న ఆ పార్టీలో ఎస్సీలకు రక్షణ కరువని, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు విమర్శించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. టీడీపీ శింగనమల దళిత నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణి తండ్రిపైనే నారా లోకేష్ విడిదిప్రాంతంలో దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. సాక్షాత్తు నియోజకవర్గ దళిత ఇన్‌చార్జ్‌లకే టీడీపీ లో రక్షణ లేనప్పుడు ఇక సామాన్య దళితులకు ఆ పార్టీలో రక్షణ ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌పైనే టీడీపీ అధిష్టానం ప్రోత్సహిస్తున్న టూమెన్ కమిటీ కుటుంబీకులు దాడులు చేస్తుంటే చంద్రబాబునాయుడు కానీ నారా లోకేష్‌కానీ ఖండించక పోవడం దుర్మార్గకరమన్నారు. నారా లోకేష్‌కు దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే దళిత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతిపై నారా లోకేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. మరోమారు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తూ ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు.

## అభివృద్ధి గూర్చి మాట్లాడే అర్హత టీడీపీకు లేదు..!

మొదటిపేజీ తరువాయి...

వాపోయారు. నారా లోకేష్ పాదయాత్రను, ఆ పార్టీ అధినేత అబద్దాల చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని ఆ పార్టీకి కాలం చెల్లిందన్నారు. ఈ సమావేశంలో మాజీ డీసీయంఎస్ ఛైర్మెన్ సోమర జయచంద్రనాయుడు, విడపనకల్లు మాజీ ఎంపీపీ వి.రమణారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మెన్ యం.వి.రమణయాదవ్, కొనకొండ్ల, గంజికుంట, జరుట్ల రాంపురం, రేణిమాకులపల్లి, తట్రకల్లు, షేక్షానుపల్లి గ్రామాల సర్పంచ్‌లు ఇందిరమ్మ, జయేంద్రరెడ్డి, తిరుపాల్‌యాదవ్, బోయ రామాంజినేయులు, క్రిష్టప్ప, పల్లి లింగన్న, మాజీ ఎంపీటీసీ దేవేంద్ర, వైసీపీ నాయకులు తిప్పారెడ్డి, ఆకుకూర నాగరాజు, చంద్రమోహన్‌రెడ్డి, దుద్దేకుంట సూరి, కొనకొండ్ల లాలెప్ప, పాల్తూ మహాలింగ, డోనేకల్లు సురేష్, మలాపురం కేశన్న, పందికుంట ఎర్రిస్వామి, చాబాల గురు, వరజకరూరు ఏసన్న, ఉండబండ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

04ATP13_04ATP13.qxd 08-04-2023 PM 10:47 Page 1



# జగన్ పాలనకు జననీరాజనం

- ప్రతి ఇంటా సంక్షేమ కాంతుల విరాజిల్లుతున్నాయి
- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి


ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న ప్రజలు


ప్రజా మద్దతు పుస్తకంలో ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :**
వైఎస్సార్‌సిపి ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతుండంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఎక్కడ చూసినా ప్రజలు జననీ రాజనాలు పలుకుతున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వేమారెడ్డిపల్లి, ఆకుతోటపల్లిలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు ఎమ్మెల్యేకు మంగళహారతులు పట్టి పూల వర్షం కురిపించి అపూర్వ స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను చదివి ప్రజలకు వినిపించి వారి అభిప్రాయాన్ని నమోదు చేశారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని వాటికి పరిష్కారం దిశగా అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద ప్రజలు చూపుతున్న ఆదర, అభిమానాలు చూస్తుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో అపారమైన విశ్వాసం వ్యక్తమైందన్నారు. ఇప్పటి వరకూ కనీవిని ఎరుగని రీతిలో కులమాతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అర్హులకు చేరడంతో ప్రజలు జగన్ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఓ పోలప్ప, ఈఓఆర్‌డీ రాజశేఖర్, హౌసింగ్ ఏఈ హరిప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ గోవిందు, ఎంపిపి తుమ్మల పర్వీన్‌భాను, జడ్పిటిసి దామోదర్‌రెడ్డి, కన్వీనర్లు కోళ్ల క్రిష్ణారెడ్డి, మద్దె రాజునాయుడు, సచివాలయ కన్వీనర్ ఆనంద్‌రెడ్డి, వైసిపి నాయకులు తుమ్మల షామీర్, మలకఆశ్వర్థరెడ్డి, సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, మాకం వెంకటరమణప్ప, ఉపసర్పంచ్ నారాయణ, జౌళి బాబా, మలక భాస్కర్‌రెడ్డి, ప్రభాకరనాయుడు, రమేష్, రమణారెడ్డి, తాజుద్దీన్, గోవిందరెడ్డి, ఆరీఫ్‌ఖాన్, వార్డు సభ్యులు జానీబాషతో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంత్యక్రియలకు హాజరైన ఎమ్మెల్యే


అంత్యక్రియలను హాజరైన ఎమ్మెల్యే పివి సిద్దారెడ్డి

**తనకల్లు, ఏప్రెల్ 8, ప్రభాతవార్త:**
ఈ నెల 7వ తేది శుక్రవారం మండల పరిధిలోని ఎర్రగుంట్లపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తనకల్లు మండలం కనసానివారిపల్లికి చెందిన వైసిపి పార్టీ కార్యకర్తలు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డిలు అక్కడికక్కడే మరణించిన వారి పార్థీవదేహాలను కదిరి ఏరియా ఆసుపత్రి నందు శనివారం కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్దారెడ్డి సందర్శించడం జరిగింది. పోస్ట్‌మార్టమ్ అనంతరం మృతదేహాలను సొంతగ్రామానికి తరలించిన తరలించిన తరువాత ఎమ్మెల్యే వారి అంత్యక్రియలలో పాల్గొని పార్థీవదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తక్షణ సహాయంగా రూ. 25వేల రూపాయలు ఒక్కొక్క కుటుంబానికి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మృతుడు శ్రీనివాసులు రెడ్డి ఇద్దరు పిల్లలను చదివిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. వీరు వైసిపి పార్టీలో మంచి చురుకైన నాయకులని, ఇలాంటి వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమన్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వైసిపి నాయకులు, కార్యకర్తలు , మండల కన్వీనర్ మదుసూధన్‌రెడ్డి, చిదానందరెడ్డి, ఆసుప త్రి అభివృద్ధి కమిటీ రామ్‌దేశాయిరెడ్డి, హేమశేఖర్‌రెడ్డిలు పాల్గొని మృతుల కుటుంబాలను పరామర్శించారు.

# నిధులు కేటాయించినందుకు ఎంపి తలారి రంయగ్యకు కృతజ్ఞతలు


ఎంపి తలారి రంగయ్యను సన్మానిస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**
నియోజకవర్గ కేంద్రంలోని కోర్టు ఆవరణంలో బార్ అసోషియేషన్ భవనం నిర్మాణం కోసం అనంతపురం పార్లమెంట్ సభ్యులు డా.తలారి రంగయ్య వారి నిధుల నుంచి 15 లక్షల రూపాయలు కేటాయించి భవనం నిర్మాణం కోసం కృషి చేసినందుకు బార్ అసోషియేషన్ అధ్యక్షులు దేవేంద్ర, ఆధ్వర్యంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు డా.తలారి రంగయ్య క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పది పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

**బత్తలపల్లి, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**
మండలకేంద్రంలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షాకేంద్రాలను జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ తనిఖీ చేశారు. శనివారం ఆయన మండలకేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏ విధంగా పరీక్ష రాస్తున్నారో పరిశీలించారు. అనంతరం ఆయన చీఫ్‌తో ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నది, గైర్హాజరు, మౌలిక సదుపాయాలు ఎలా వున్నాయి అని ఆరాతీశారు. బత్తలపల్లిలో మూడు పరీక్షా కేంద్రాలు వుండగా 483 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి వుండగా 478మంది హాజరవుతున్నట్లు చీఫ్‌లు వివరించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దార్ యుగేశ్వరదేవి, చీఫ్‌లు ఉమాపతి. ముకుందనాయుడు, జగన్‌మోహన్ తదితతులు వున్నారు.

# తెలుగుదేం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతన్నలకు 90 శాతం రాయితీతో డ్రిప్ అందజేస్తాం - నారా లోకేష్


మాట్లాడుతున్న నారా లోకేష్

**గార్లదిన్నె, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**
మండల పరిధిలోని జంబులదిన్నె కొట్టాల గ్రామ సమీపాన తెలుగుదేశం పార్టీ యువగళం పాదయాత్రలో భాగంగా రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేయగా సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన్న వెంటనే రైతన్నలకు 90 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ పద్దతులను అందజేయడం జరుగుతుందని అలాగే రైతన్నను వైకాపా ప్రభుత్వంలో నట్టేట ముంచుతున్నారని పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం పంటల ఎరువులు ఆకాశాన్నంటే విధంగా ధరలు పెరిగిపోవడంతో రైతులు వ్యవసాయాన్ని ఎలా సాగు చేయడం జరుగుతుందని అందుకు తెలుగుదేశం ప్రభుత్వ వచ్చిన వెంటనే రైతులకు పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వమే అని ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతుల మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేయడం చాలా దుర్మార్గమైనటువంటిచర్య అని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ, మాజీ మంత్రి పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, అమర్‌నాథ్‌రెడ్డి, పార్థసారధి పరిటాల శ్రీరామ్, జితేంద్రగౌడ్, అనంతపురం పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ఎంఎస్ రాజు, ఆలం నరసనాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మారుతిచౌదరి, పవన్‌కుమార్‌గౌడ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్యేక దువాలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత


ప్రత్యేక దువాలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**
పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదులో నిర్వహించిన ప్రత్యేక దువా కార్యక్రమంలో శనివారం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. నగరంలోని 5వ రోడ్డు మసీదులో శనివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని అంతకు మ ఉందు ప్రేత్యేక దువ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దు అకాడమి చైర్మన్ నదీమ్ అహ్మద్, నగర మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకెఎస్ ఫయాజ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, కార్పోరేటర్లు ఇషాక్, రహంతుల్లా, ఆల్‌మేవా సంఘం నాయకుడు షేక్షావలి, వైసీపీ నేతలు ఖాజా, దాదు తదితరులు పాల్గొన్నారు.

# గుత్తిలో జీసస్ ఫర్ రన్


క్రైస్తవ సోదరులు జీసస్ ఫర్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

**గుతి , ఏప్రిల్ 8 ప్రభాతవార్త :** సత్యాన్వేషణ, మాన వాళి మహోదయాని కై తన రక్తాన్ని చిందించిన మహోన్న తుదు ఏసుప్రభువని మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నూర్‌బీ పేర్కొన్నా రు. గుత్తి పట్టణంలోని శనివారం క్రైస్తవసంఘాల ఆధ్వర్యంలో జీసస్ ఫర్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌లోని సిఎస్ఐ చర్చి నుండి పట్టణంలోని ఇఎస్ఐ చర్చి వరకు నాలుగు కిలోమీటర్ల మేర పరుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీచౌక్ వద్ద చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభువు బోధించిన క్షమాపణ, రక్షణ, ఆదరణ, ఆవేదన, శ్రమ, జయం, ఆత్మార్పణ ప్రభోదాలను అనుసరించి ప్రతి ఒక్కరు సంఘజీవిగా మెలగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ రాయలసీమ ట్రెజరర్ కిరణ్, హెచ్ఎం కిరణ్, వై.టి బాబు, డేవిడ్‌నాయక్, బింగిబాబు, ఫాస్టర్లు, క్రైస్తవ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి పథకాలు నాడెందుకు అందించ లేక పోయారు

- టీడీపీ నేతలను ప్రశ్నించిన ఎమ్మెల్యే అనంత


లబ్దిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత

**అనంతపురం సిటీ, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేడు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నాటి టీడీపీ పాలనలో ఎందుకు అందించలేకపోయారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. నగరంలోని 23వ డివిజన్‌లో శనివారం స్థానిక కార్పోరేటర్ హరితతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి ఆయా కుటుంబాలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇదే సందర్భంలో టీడీపీ పాలనకు వైసీపీ పాలనకు ఉన్న తేడాను వివరించే బ్రౌచర్‌ను వారికి అందించారు. సంక్షేమ పథకాలు అమలు అవుతున్న తీరు ఇంకా ఏమైనా మార్పులు చేర్పులు అవసరామా అంటూ ఆరా తీశారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే వైసీపీ ప్రభుత్వానికి మరోమారు అండగా ఉండాల్సిన ఆవశ్యకతను వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ.. నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో అధికారంలోకి వస్తే ఏం చేస్తారో.. గతంలో ఏం చేశారో.. చెప్పకుండా కేవలం అసత్యపు ఆరోపణలతో పాదయాత్ర కొనసాగిస్తున్నారన్నారు. మూడున్నరేళ్ల వైకాపా పాలనలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా గడప వద్దకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు కానీ, నాటి క్యాబినెట్‌లో మంత్రిగా పని చేసిన నారా లోకేష్‌కానీ ఇలాంటి సంక్షేమ పథకాల గురించి ఎందుకు ఆలోచన చేయలేక పోయారని ప్రశ్నించారు. టీడీపీ ఎన్ని కుయుక్తులు చేసినా 2024లో వైసీపీప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెసిఎస్ క్లస్టర్, కన్వీనర్, చింతకుట మధు, సచివాలయ కన్వీనర్ దాసరి గోవిందుతోపాటు, గృహ సారధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ

- బీజేపీ జిల్లాస్థాయి ఎన్నికల నిర్వహణ సమితి సదస్సులో ఎమ్మెల్యే సోమలింగప్ప


బీజేపీ జిల్లాస్థాయి సదస్స సభలో మాట్లాడుతున్న శిరుగుప్ప ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప

**బళ్లారి, ఏప్రిల్08, ప్రభాతవార్త ;**
ప్రపంచంలోనే బీజేపీ అతిపెద్ద పార్టీ. అధిక సంఖ్యలో సభ్యులను, అధిక సంఖ్యలో ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిగి ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని శిరుగుప్ప ఎమ్మెల్యే ఎం.ఎన్.సోమలింగప్ప పేర్కొన్నారు. బళ్లారిలో బీజేపీ ఎన్నికల నిర్వహణ సమితి జిల్లాస్థాయి సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై స్వల్ప పాలన వ్యవధిలోనే అమోఘమైన అభివృద్ధి పనులు చేసి చూపించారని, తనకు తెలిసి ఇటువంటి అభివృద్ధి ఆకాంక్ష గల సీఎంను చూడలేదన్నారు. శిరుగుప్ప నియోజకవర్గానికి సుమారు రూ.800 కోట్ల నిధులను కేటాయించారు. తాలూకాలో అనేక అభివృద్ధి, మౌలిక సౌకర్యాల వృద్ధి, ఇతర యోజనల అమలు జరిగిందని, ఆశ్రయ యోజన కింద నిరుపేద ప్రజలకు ఇళ్ల పట్టాలు, స్త్రీ స్వసహాయ గ్రూపులకు చెందిన మహిళలకు వ్యాపారాల కొరకు భారీ స్థాయిలో రుణాల వితరణ చేసినట్లు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది, తిరిగి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కానున్నదని జోస్యం చెప్పారు. ఈసారి ఎన్నికల్లో తాను శిరుగుప్ప క్షేత్రంలో బీజేపీ అభ్యర్థిగా గెలవకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పారు. బళ్లారి జిల్లాలో ఐదు క్షేత్రాల్లోనూ బీజేపీ గెలవడం ఖాయమని, ఇందు కోసం ఇప్పటి నుంచే పార్టీ బూత్‌స్థాయి నుంచి కార్యకర్తలు, నాయకులు శ్రమించి ప్రజల మధ్య సంచరించి బీజేపీ ప్రభుత్వపు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి, బీజేపీకి ఓటువేసేలా చూడాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మురహరగౌడ, ఎన్నికల నిర్వహణ సమితి అప్పగించి బాధ్యతలకు సంబంధించి 30 విభాగాల ప్రముఖుల జాబితాను సభలో వివరించారు. ఈ సభలో ఎమ్మెల్సీ వై.ఎం.సతీష్, విరుపాక్షగౌడ, కె.రామలింగప్ప, అనిల్‌నాయుడు, మారుతిప్రసాద్, డా.మహిపాల్, సిద్దేశ్‌యాదవ్, ఎర్రంగళి తిమ్మారెడ్డి, పారు్వతి ఇందుశేఖర్, కె.ఎస్.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెక్‌పోస్టుల వద్ద రూ.9.17 లక్షల ఆభరణాలు పట్టివేత


జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి

**బళ్లారి, ఏప్రిల్08, ప్రభాతవార్త ;**
జిల్లావ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జిల్లా సరిహద్దున ఏర్పాటు చేసిన వివిధ చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, అధికారులు తమ కార్యాచరణలో రూ.9.17 లక్షలు విలువైన బంగారు, వెండి నగలు స్వాధీన పరుచుకున్నట్లు, కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారి పవన్‌కుమార్ మాలపాటి తెలిపారు. మూడు రోజుల వ్యవధిలో 161.71 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు, సుమారు రూ.8.99 లక్షలు విలువ ఉన్నట్లు, అలాగే 66 గ్రాముల వెండి, రూ.3 వేలు ఉన్నట్లు, రూ.15 వేలు విలువైన నాలుగు తెల్లటి రత్నాలు స్వాధీన పరుచుకున్నట్లు, అలాగే రూ.18,492 విలువైన 39.51 లీటర్ల మద్యం బాటిళ్లను కూడా స్వాధీనపరుచుకున్నట్లు జిల్లాధికారి తెలిపారు. జిల్లా ఎక్సైజ్ శాఖచే ఇప్పటివరకు 35.28 లీటర్ల మద్యం, పోలీసుశాఖచే 4.23 లీటర్ల మద్యం స్వాధీన పరుచుకున్నట్లు, వీటి విలువ రూ.18,492గా ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో అన్ని చెక్‌పోస్టుల వద్ద అక్రమ కార్యకలాపాలపై నిఘా వేసి ఉంచినట్లు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది 24 గంటలపాటు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపిన జిల్లాధికారి, ఈ కార్యాచరణలో మొత్తం 43 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 27 ఎస్ఎస్‌టీ బృందాలు, 7 ఎక్సైజ్ రైడింగ్ బృందాలు కార్యం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ఇప్పటివరకు ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎంఎస్‌టీ, పోలీసుశాఖల బృందాలు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి వసూలు చేసిన మొత్తం నగదు రూ.5.80 లక్షలుగా ఉన్నట్లు, కోర్టు మార్గదర్శకం మేరకు ఎన్నికల అధికారుల సమక్షంలో జిల్లా ఖజానా కార్యాలయంలో భద్రపరిచి ఉంచినట్లు తెలిపారు.

# వైసీపీ ప్రభుత్వానికి మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి సెల్ఫీ ఛాలెంజ్..!


ఈ గార్మెంట్‌ను ఎప్పుడు ఓపెన్ చేసి 5వేల మందికి ఉపాధి కల్పిస్తారు అంటూ చాలా సెల్ఫీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల

**మడకశిర టౌన్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త**
మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా గత తేదేపా హయాంలో చేపట్టిన పనులను అర్థాంతరంగా ఆపేసిన ప్రస్తుత వైకాపా సర్కారు వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ప్రభుత్వానికి శనివారం రోజు సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొడికొండ చెక్ పోస్ట్ నుంచి సిరా వరకు నేషనల్ హైవే ( జాతీయ రహదారి) తెచ్చామన్నారు. అదే విధంగా మడకశిర పట్టణ పరిధిలో చీపులేటి గ్రామం వద్ద గార్మెంట్ ఫ్యాక్టరీని గత ప్రభుత్వం హయాంలో 100 శాతం పూర్తి చేయించామన్నారు. ఈ ఫ్యాక్టరీ ప్రారంభం అయివుంటే మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 3వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అంది ఉండేవని తెలిపారు. అయితే ఇంత వరకు వైకాపా ప్రభుత్వం ప్రారంభించక పోవడం దారుణమన్నారు. అదే విధంగా గత ప్రభుత్వం హయాంలో పట్టణ సుందరీకరణం కోసం కోట్ల రూపాయలు వెచ్చించి డివైడర్ ఏర్పాటు చేసి మధ్యలో బట్టర్ ఫ్లై లైట్లు అమర్చావన్నారు. పట్టణంలో పావగడ రోడ్డు, పెనుకొండ రోడ్డు, పట్టణంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి 80 శాతం పూర్తి చేశామన్నారు. మిగిలి పోయిన హిందూపురంరోడ్డు, మధుగిరి రోడ్డు, అమరాపురం రోడ్డు మార్గంలో అసంపూర్తి పనులను ఈ ప్రభుత్వం వచ్చి 4 సంవత్సరాలు గడిచిన ఇంత వరకు ఒక్క కరెంటు స్తంభాలు కూడా ఏర్పాటు చేయలేదని విమర్శలు గుప్పించారు. జూనియర్ కళాశాల క్రీడా ఆవరణలో గ్రౌండ్ ఇండోర్ స్టేడియం నిర్మిస్తూ పూర్తి అవుతున్న తరుణంలో ఇప్పుడు ఉన్న ప్రభుత్వం దాన్ని కూడా నేటికి పూర్తి చేయలేక పోయిందని దుయ్యబట్టారు. మంజూరైన రింగ్ రోడ్డు, వైసీపీ ప్రభుత్వం వచ్చి దానిని రద్దు చేసిందన్నారు. రైతులకు వరప్రసాదంగా 110 కోట్ల వ్యయంతో హెచ్‌విడిఎస్ పథకం ద్వారా రెండు మోటార్లకు ఒక 25 కెవి ట్రాన్స ఫార్మర్ ఏర్పాటు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి దక్కుతుందన్నారు. బాల, బాలికల గురుకుల పాఠశాల, గుండుమల బాలుర గురుకుల పాఠశాల, గుడిబండ బాలికల గురుకుల పాఠశాలలు అర్థాంతరంగా నిలిచిపోయాయని వాటిని కూడా ఈ ప్రభుత్వం పూర్తిగా చేయలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఆర్థికంగా చితికి ఆరోగ్యం చెడి ఆసుపత్రిపాలై ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న మడకశిర ప్రజలకు 40 కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. ఇప్పటికైనా బేషజాలకు పోకుండా అర్థాంతరంగా ఆపేసిన పనులు పూర్తి చేయాలని ఈ ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఛాలెంచ్ చేస్తూ, అభివృద్ధికి అడ్డుపడుతు ప్రజలకు వంచనకు గురి చేస్తున్నది ఎవరా అన్నది ప్రజా కోర్టులో బహిరంగంగా సవాల్‌కు సిద్దమా అని గుండుమల తిప్పేస్వామి సెల్ఫీ సవాల్ విసిరారు. ఈయన వెంట రాష్ట్ర కార్యదర ఇశ డా.శ్రీనివాస్ మూర్తి, కన్వీనర్లు మనోహర్, లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప తదితరులు పాల్గొన్నారు.